

## సుంకిడిలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

**శెనార్తి మీడియా, తలమడుగు :**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ విష ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ప్రతినిధి మోట్టే కిరణ్ కుమార్ అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు సుంకిడి జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మీద కావాలనే విష ప్రచారానికి తెరలిపిందన్నారు. ఇది ముమ్మాటికీ కాళేశ్వరం ప్రాజెక్టుపై విష ప్రచారం చేసి ఆ నీటిని బనకచర్ల వంటి ప్రాజెక్టులకు దోచిపెట్టేందుకు గురు శిష్యులు కలిసి ఆడుతున్న నాటకమన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిరామ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎగ్గిడి ప్రకాశ్, సుదర్శన్ రెడ్డి, ఆశన్న యాదవ్, ప్రకాష్ రెడ్డి, నిట్టడి గంగాధర్, రవికాంత్ యాదవ్, శ్రీనివాస్, పొచ్చన్న, నర్సింలు, రాంకిషన్, గజానంద్, ప్రమోద్, చందు, అజయ్, మహేష్, మగ్గిడి ప్రకాష్ పాల్గొన్నారు.




## కేశవపట్నంలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

శెనార్తి మీడియా, శంకరపట్నం: కాళేశ్వరం ప్రాజెక్ట్ పై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐకి తప్పుడు నివేదిక అప్పగించడాన్ని నిరసిస్తూ కేశవపట్నంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందించారు. జాతీయ రహదారిపై నాయకులు రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక తప్పులతడకగా మారిందని నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సంజీవరెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



## పర్యావరణ హితమే లక్ష్యంగా ముందుకు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** వినాయక మండలిని పర్యావరణహిత మండలిగా తీర్చిదిద్దేందుకు కమిటీ సభ్యులు, మహిళా సభ్యులు, కాలనీ వాసులు ఐకమత్యంగా కృషి చేస్తున్నారని మండలి నిర్వహణ కమిటీ అధ్యక్షు లు గడియారం శ్రీహరి, కార్యనిర్వహణ అధ్యక్షుడు పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను గౌరవిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించామని చెప్పారు. కలెక్టరేట్ రోడ్ టీఎన్జీవోస్ కాలనీ హౌసింగ్ బోర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పర్యావరణహిత వినా యక మండలిలో ప్రతిరోజు ప్రసాద వితరణలో ఆకుడొప్పలు వినియో గిస్తున్నారు. అన్నదానం, అల్పాహార దానాల్లో స్టీలు ప్లేట్లు, స్టీలు గ్లాసులు వాడగా, పూజల్లో అరటి ఆకులు, కాగితం ప్లేట్లు, స్టీలు, ఇత్తడి, వెండి పాత్ర లు, వెదురు బుట్టలు ఉపయోగిస్తున్నారు. ఈ రోజు అన్నదానం న్యాయ వాది, పొక్సో చట్టం పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుదారి రాంబాబు, శోభారాణి దంపతులు నిర్వహించారు. ఉదయం పూజల్లో పోరండ్ల శ్రీనివాస్, కళ్యాణి దంపతులు పాల్గొన్నారు. పర్యావరణహిత వినాయక మండలికి కాలనీవాసి రంగా గౌడ్ 50 స్టీలు ప్లేట్లు, స్టీలు గ్లాసులు, ఆకుడొప్పలు కానుకగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండలి బాధ్యులు పొన్నమల్లయ్య, మొండయ్య, రామ్ మోహన్, శ్రీపతి బాబు, నాగేశ్వర్, తిరుపతి రెడ్డి, పి. స్వర్ణ, బి. అరుణ, కళావతి, రమాదేవి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



## మూడు రోజులు వైన్ షాపులు బంద్..

- **ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్..**

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

అబ్కారీ సర్కిల్ పరిధిలో గణేష్ నిమజ్జనం దృష్ట్యా 3 రోజులు వైన్ షాపులు బంద్ పాటించాలని ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్ పేర్కొన్నారు.ఈనెల 3వ తేదీ సా.6 గం.ల నుండి 5వ తేదీ ఉ.10 గం.ల వరకు తాంసి, భీంపూర్, జైనథ్, మావల, ఆదిలాబాద్ పట్టణంలో అదేవిధంగా ఈనెల 5వ తేదీ సా.6 గం.ల నుండి 7వ తేదీ ఉ. 10 గం.ల వరకు బేల, తలమడుగు, జైనథ్, మావల, ఆదిలాబాద్ పట్టణంలోని వైన్స్ లు, బార్లు,తెల్ల కల్లు దుకాణాలను మూసి ఉంచాలని సూచించారు.

## తుది ఓటర్ల జాబితా ప్రదర్శన

శెనార్తి మీడియా, శంకరపట్నం: శంకరపట్నం మండల పరిధిలోని 27 గ్రామపంచాయతీల్లో తుది ఓటర్ల జాబితాను వార్డుల వారీగా మంగళవారం ప్రదర్శించారు. ముందుగా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సవరణలు పూర్తి చేసిన తర్వాత తుది జాబితాను గ్రామపంచాయతీ స్థాయిలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే అన్ని గ్రామపంచాయతీల్లో పోలింగ్ స్టేషన్ల తుది జాబితా కూడా ఈరోజు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

## టీకాలపై అవగాహన కార్యక్రమాలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్టు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెలలో నిర్వహించనున్న టీకాల కార్యక్రమం గురించి వివరాలు తెలియజేసి, టీకాల వల్ల కలిగే లాభాలను వివరించారు. గ్రామాలలో టీకాల కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి 100 శాతం టీకాలు వేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ముందస్తు చర్యలలో భాగంగా గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సహకారంతో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. సంక్రమణ వ్యాధులపై ప్రజలకు వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాశీపూర్ వైద్యాధికారి డాక్టర్ లహరి, హెచ్ఈఓ రఘుపతి, డిపిహెచ్ఎన్ పద్మ, ఎపిడిమాలజిస్ట్ సుమన్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాలలో వైద్య సేవలతోపాటు అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ అంశంపై తల్లులకు, ఇంటి పెద్దలకు స్పష్టమైన అవగాహన కలిగించాల్సిన అవసరముందని కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలే అవకాశముందని హెచ్చరించారు. ప్రతి ఇంటిలో వారానికి రెండు రోజులు డ్రైడే పాటించి, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. డీఎంహెచ్ఓ అనిత ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్టు వివరించారు.



## గణనాథులను దర్శించుకున్న పిడుగు అభిరామ్ రెడ్డి

**శెనార్తి మీడియా, తలమడుగు :**



మండల కేంద్రంలో కొలువుదీరిన గణనాథులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిడుగు అభిరామ్ రెడ్డి దర్శించుకున్నారు... వారికి యువజన సంఘాల సభ్యులు ఘన స్వాగతం పలికి .. శాలువాలతో సత్కరించారు.. వారి వెంట నాయకులు గంగాధర్, నవీన్ రెడ్డి, నేతుల గంగన్న, శ్రీకాంత్, నారాయణ రెడ్డి, యువజన సంఘ ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు...



## రక్తదానానికి ముందుకు రావాలి..

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ టైగర్ గ్రూప్ కీ చెందిన రోహిత్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రిమ్స్ బ్లడ్ బ్యాంకులో లింగంపల్లి శశికాంత్ ఆధ్వర్యంలో పలువురు యువకులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.పలువురు వీరిని అభినందించారు.రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు.



## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఏపీ డిప్యూటీ సీఎం,సినీ నటుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 57వ జన్మదిన వేడుకలను ఆదిలాబాద్ శ్రీ ఆంజనీ పుత్ర మెగాస్టార్ చిరంజీవి,పవన్ కళ్యాణ్ సేవా సమితి సభ్యులు ఘనంగా జరుపుకున్నారు.సోమవారం పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్ఎస్ గార్డెన్ లో ఆయన అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పవన్ కళ్యాణ్ చేస్తున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.తమ అభిమాన నటుడు చూపించిన సామాజిక సేవ మార్గదర్శకత్వంలో చురుగ్గా పాల్గొంటామని వాపోయారు.జిల్లాలో రక్తదాన, నేత్రదాన కార్యక్రమాలు నిర్వహించి అభిమాన బలాన్ని తెలియజేస్తామని వెల్లడించారు.పవన్ కళ్యాణ్ రాజకీయాలతో పాటు అనేక సినిమాలు చేసి తమను మరింత అలరించాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో తమ సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రమణ ఆదేశాల మేరకు అభిమాన సంఘాల సదస్సులు, సమీక్షలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ అంజనీపుత్ర మెగాస్టార్ చిరంజీవి,పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సేవాసమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాల శంకర్ కృష్ణ, గౌరవ అధ్యక్షులు భీమ్సేన్, రెడ్డి, పట్టణ అధ్యక్షులు పాక సత్యం, అభిమానులు ఊరే గణేష్, రవి, విపిఎస్ లక్కు సంతోష్, దీక్షిత్, హేమంత్, రవికుమార్, ప్రణీత్, పవన్ ,రిత్విక్ రెడ్డి, తేజస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గణేషుడికి తీరొక్క ప్రసాదాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ లో 'మన పార్వతీ పుత్ర గణేషుడి'కి భక్తులు తీరొక్క ప్రసాదాలు సమర్పించారు. గుండేటి అనసూర్య అనే భక్తురాలు ఒక్కరే ఏకంగా 55 రకాల ప్రసాదాలను సమర్పించి దేవుడి మీద తనకు ఉన్న భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, మహిళలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భక్త మండలి అధ్యక్షుడు సిరిపురం గణపతి, కోశాధికారి బోడకుంట నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి హరి, గౌరవాధ్యక్షుడు చిటూరి పాపారావు, ప్రచార కార్యదర్శి మారం రఘు, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మొలంగూర్ పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

గ్రామ పాలనను పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శి తన హద్దులు దాటి ప్రవర్తిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని మొలంగూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారి తీరు గ్రామంలో చర్చనీ యాంశంగా మారింది. మొలంగూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రవర్తన గ్రామస్తులను భయాందోళనలు కలిగిస్తోందని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు మోరే గణేష్ తెలిపారు. నూతన గృహ నిర్మాణాల అనుమతులు, గ్రామ సమస్యల పరిష్కారం కోసం వెళ్లిన ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన రాయిని రాజయ్య మరణించగా, ఆయన అల్లుడు ఇంటి ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మూడు నెలలుగా వాయిదా వేస్తూ ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. ఈ విషయంలో ప్రశ్నించగా కార్యదర్శి కుర్చీతో దాడి చేసే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. ప్రతి పనికీ రేటు నిర్ణయించి ప్రజల నుండి బలవంతంగా వసూళ్లు చేస్తున్నాడని గణేష్ ఆరోపణలు చేశాడు. ఈ విషయాన్ని మంగళవారం గ్రామానికి వచ్చిన ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీ ఓ ప్రభాకర్‌ల దృష్టికి తీసుకెళ్లి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## విద్యుత్ షాక్ తో గేదె మృతి

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :**



ఆదిలాబాద్ మండలంలోని చాంద (టి) గ్రామానికి చెందిన రామెల్లి సంతోష్ అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్ తో మృతి చెందింది... ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామ శివారులోని పరిసర ప్రాంతాల్లో లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో.. స్తంభాల కు విద్యుత్ సరఫరా ఉండడంతో మేతకు వెళ్లిన గేదె ప్రమాదవశత్తు విద్యుత్ షాక్ తగలడం తో అక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు.. గేదె విలువ రూ. 60 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.